సాక్షి జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 22 | జనవరి | 2023



నిధులు కేటాయించాలి

కేంద్ర ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో పదిశాతం నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో▸



మెడికల్ మాఫియా లబ్ధికే..

మెడికల్ మాఫియాకు లబ్ధి చేకూర్చడం కోసమే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ ఆరోపించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $32^0/18.6^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడి మామూలుగా ఉంటుంది. రాత్రి పొగమంచు కారణంగా చలి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు చేయాలి



భూపాలపల్లి అర్బన్: ఈనెల 26న జరుగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు సింగరేణి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు ఆదేశించారు. జీఎం కార్యాలయంలో శనివారం ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేడుకలు అంబరాన్నంటేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఏరియాలోని గనులు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఎంపిక చేసి సన్మానం చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటయ్య, రామలింగం, జ్యోతి, ఎస్ వి రావు, పద్మజ, తుకారం, షరీఫ్, శ్యాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుకాయ వేలం

మహదేవపూర్: మండలకేంద్రంలోని దసలి విత్తన కేంద్రం ఆధ్వర్యంలో పట్టుకాయను శనివారం వేలం నిర్వహించారు. రైతులు నల్లమద్ది అటవీ తోటలో 2 నెలల్లో పెంచిన దసలి పట్టు కాయను మాదాపూర్ విత్తన కేంద్రానికి తరలించగా మొత్తం 7,34,000 దసలికాయ వచ్చింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కొనుగోలుదారులు రాగా గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం అత్యధికంగా వెయి కాయకు రూ.6,600 చొప్పున వేలం పాట పాడి దక్కించుకున్నారు. దీంతో సుమారు రూ.50లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ మురళీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవి ప్రసాద్, భగవాన్, కల్చర్ అధికారి సమ్మయ్య, దుర్గయ్య, రవి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీబీజీకేఎస్ భవనం ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో నూతనంగా నిర్మించిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) యూనియన్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత, రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి, యూనియన్ నాయకులు హాజరుకానున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కొక్కుల తిరుపతి కుటుంబ సభ్యులను కవిత పరామర్శించనున్నారు.

రెవెన్యూశాఖలో ప్రకంపనలు!

కాళేశ్వరం: మహదేవపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారిపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు రంగం సిద్ధం చేశారని శనివారం 'రెవెన్యూ అధికారిపై విచారణ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆశాఖతో పాటు మండలంలో ప్రకంపనలు సృష్టించింది. సదరు అధికారిపై నిఘావర్గాలు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శాఖాపరమైన విచారణ చేస్తున్నట్లు తెలిసింది. బియ్యం రవాణా చేసి పట్టుకున్న వ్యవహారంలో అధికారి చేతివాటమే కాకుండా ఇతర వ్యవహారాల్లో కూడా ఆ అధికారి కనుచూపుల్లోనే నడుస్తుందని ఆరోపణలు వస్తుండడంతో త్వరలో వేటు పడే అవకాశం ఉందని రాజకీయ, పోలీసు, అధికార వర్గాల్లో చర్చానీయాంశమైంది.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని షెడ్యూల్డ్‌కులాల నిరుద్యోగ యువతకు స్పెషల్ ఫౌండేషన్‌లో భాగంగా గ్రూప్ 2, 3, 4, నాన్ రెసిడెన్షియల్‌లో మూడు నెలల పాటు కోచింగ్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైన డిగ్రీలో ఉత్తీర్ణులయిన వారు అర్హులన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీపీని కలిసిన ఓఎస్డీ, ఏఎస్పీ

ములుగు: నూతనంగా వరంగల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రంగనాథ్‌ను ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఓఎస్డీ గౌస్ ఆలం, ములుగు ఏఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ శనివారం పుష్పగుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరు జిల్లాల పరిస్థితిని ఆయనకు వివరించారు. మావోయిస్టుల ఏరివేతకు చేపడుతున్న చర్యలపై ఓఎస్డీని సీపీ అభినందించారు.

సమస్యలతో సతమతం

- సమావేశాలు లేవు.. సమస్యలు తీరవు!
- మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌ల నిర్వహణలో నిర్లక్ష్యం
- మూడేళ్లలో 22 సమావేశాలు మాత్రమే..
- అలంకారప్రాయంగా వార్డు కమిటీలు
- పట్టణంలో పేరుకుపోతున్న సమస్యలు



భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

భూపాలపల్లి: మున్సిపాలిటీ అభివృద్ధి, సమస్యలపై చర్చించాల్సిన అధికారులు, పాలకులు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడంలోనే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మరోవైపు వార్డు కమిటీలు అలంకారప్రాయంగానే మారాయి. ఫలితంగా పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు.

నెల విడిచి నెల సమావేశం..

మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి నెల కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యలు, అభివృద్ధిపై చర్చించాలి. అయితే 2020 జనవరి 27న భూపాలపల్లి మున్సిపాలిటీకి నూతన పాలకవర్గం ఏర్పడగా కోవిడ్ కారణంగా తొలుత మీటింగ్‌లు నిర్వహించలేదు. కోవిడ్ పనుల్లోనే నిమగ్నం అయ్యారు. ఆ ఏడాది 7 సార్లు, 2021లో 8 సార్లు, 2022లో 7 సార్లు మాత్రమే కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గడిచిన మూడేళ్లలో మొత్తంగా 22 సార్లు మీటింగ్‌లు జరిగాయి. అందులో మూడుసార్లు బడ్జెట్ ఆమోదం కోసం, ఒకసారి మాస్టర్ ప్లాన్ ఆమోదం కోసం జరిగింది. అయితే సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడం, అభివృద్ధిపై చర్చ జరగకపోవడం మూలంగా చిన్నచిన్న సమస్యలు కూడా సకాలంలో పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్తుత్తి వార్డు కమిటీలు..

పట్టణ అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు, క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లేందుకని వార్డు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని నూతన మున్సిపల్ చట్టం సూచించింది. ఈ మేరకు భూపాలపల్లి పట్టణంలో హ్యూమన్ కమిటీ, యూత్ కమిటీ, సీనియర్ సిటిజన్ కమిటీ, ప్రామినెంట్ పర్సన్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో 15 మంది సభ్యుల చొప్పున మొత్తం 60 మంది సభ్యులు ఉంటారు. వీరు ప్రతీ నెల వార్డులో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, చర్చించి, సమస్యలను కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లాలి. సదరు కౌన్సిలర్ సమస్యలను కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తాడు. కానీ కమిటీలు ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క సమావేశం జరగలేదు.

కౌన్సిల్ సమావేశాలు జరిగాయిలా	
2020	07
2021	08
2022	07

సమావేశాలు నిర్వహిస్తాం..

కొత్త పాలకవర్గం ఏర్పడిన అనంతరం కోవిడ్ కారణంగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేకపోయాం. ఇప్పుడు ప్రతి నెల నిర్వహించేలా చూస్తున్నాం. వార్డు కమిటీలు ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి. వార్డు ఆఫీసర్లతో చెప్పి మీటింగ్‌లు జరిగేలా చూస్తాం.

- అవినాశ్, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలు

- కోతులు, పందులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది.
- ఏడాది క్రితం నిర్మించిన మూడు పట్టణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి.
- ఓసీపీ 2 బ్లాస్టింగ్‌లతో పలు కాలనీల ఇళ్ల బీటలు వారుతున్నాయి.
- రూ. 40 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ వృథాగా ఉంది.
- మిషన్ భగీరథ పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి.
- మిషన్ భగీరథ పనులతో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయడం లేదు.
- పలు కాలనీల్లో సైడ్ కాల్వలు లేక మురుగు నీరు రోడ్లపై పారుతుంది.
- పట్టణంలోని జాతీయ రహదారి వెంట లారీలను నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.
- మూడు కూడళ్ల వద్ద పార్కింగ్ స్థలం లేక వాహనదారుల ఇక్కట్లు
- షాపుల ఎదుట పార్కింగ్, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి.
- పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు.
- స్ట్రీట్ వెండర్స్ కోసం నిర్మించిన దుకాణ సముదాయం ప్రారంభానికి నోచుకోవడం లేదు.
- వారసంతకు సొంత స్థలం లేదు.
- రహదారులపైనే కూరగాయలు, పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి.
- కార్మికుల కొరత కారణంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదు.
- నిధుల కొరతతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్: క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలను శనివారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి క్రికెట్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులను వివిధ రంగాల్లో ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఉచిత స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి రూ.1లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఎగ్జామ్ వెంకటరమణ సిద్ధు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో శనివారం 9వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ క్రీడలను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేయకుండా తమకు నచ్చిన నైపుణ్యంమీద దృష్టి సారిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సాంబశివరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శోభన్ బాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్, జిల్లా స్పోర్ట్స్ అధికారి సునీత, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాజేందర్, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి అభినవ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణబాబు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రధాన కోర్టులు అందుబాటులోకి వచ్చాయని, న్యాయసేవలను విస్తృతం చేసి పెండింగ్ కేసులు లేకుండా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు ఆదేశించారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం కోఆరినేషన్, క్రైం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీపీ కేసులను చార్జిషీట్ దాఖలు చేసిన 6 నెలలలోపు పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని, ఎన్‌టీడబ్ల్యూ వారెంట్ల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారానికి షెడ్యూల్ ప్రకారం సాక్షులను హాజరు పరచాలన్నారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులకు, మహిళా న్యాయవాదులకు, కక్షిదారులకు క్యాంటీన్, వెయిటింగ్ హాల్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల 11న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీలు జయరామిరెడ్డి, రామచందర్ రావు, జాయింట్ కలెక్టర్ స్వర్ణలత, ఎస్పీ సురేందర్ రెడ్డి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో కంటివెలుగు శిబిరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, కమిషనర్ కుటుంబ సంక్షేమ శాఖ శ్వేత, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి కంటివెలుగు నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెల 19, 20వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల వివరాలను వైద్య శాఖ అధికారులు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 రోజుల్లో 3,81,426 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 97,335 మందికి రీడింగ్ కళ్లద్దాలు పంపిణీ చేశామని, 77,142 ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలను ఆర్డర్ చేశామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన కలెక్టర్‌లను, సంబంధిత అధికారులను అభినందించారు. ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు క్యాంపులు జరుగుతాయని, శని ఆదివారాలు క్యాంపులు ఉండవన్నారు. జిల్లాలో క్వాలిటీ కంట్రోల్ బృందాలు విస్తృతంగా కంటి వెలుగు క్యాంపులో పర్యటించాలని, జిల్లా కలెక్టర్లు సదరు బృందాల ఫీడ్ బ్యాక్ తీసుకుని మెరుగైన శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని బఫర్ బృందాలను ఉపయోగిస్తూ జర్నలిస్టులకు, ఉద్యోగులకు, పోలీసులకు, కోర్టు సిబ్బంది, వివిధ వర్గాల వారికి ప్రత్యేక కంటి వెలుగు క్యాంపుల నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీపీఓ ఆశాలత, అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం

- భూపాలపల్లి డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎం ప్రతిమరెడ్డి

కాటారం: ప్రయాణికులను భద్రంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ముఖ్య లక్ష్యమని ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి అన్నారు. కాటారం మండలం ప్రతాపగిరిలో సర్పంచ్ గుంటి లక్ష్మి ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజా రవాణాలో 90 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో ఆర్టీసీ సేవలు విస్తృత పరుస్తున్నట్లు డీఎం పేర్కొన్నారు. కాటారం, మల్హర్‌పల్లి రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సుకు కిలోమీటర్‌కు రూ.50 ఖర్చు కాగా ఆదాయం మాత్రం రూ.30 వస్తుందని, అయినప్పటికీ విద్యార్థులు, ప్రజల కోసం సేవలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు చూపకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దివ్యాంగులు, విద్యార్థులకు అందించే బస్‌పాస్‌లు, ఇతర సేవల గురించి డీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, భూపాలపల్లి టీఐ 2 సదయ్య, డిపో సీఆర్‌సీ చంద్రమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూలిన కలల సౌధం

- బతుకుపోరులో ప్రాణాలు కోల్పోయిన యువకులు
- పెద్దదిక్కు కోల్పోయి కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- ఇల్లందు ఘటనలో కమలాపూర్, నర్సంపేట వాసులు నలుగురు దుర్మరణం
- స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు.. విషాదఛాయలు



బైరి రాము (ఫైల్)



శివకోటి (ఫైల్)



ఓదెల కల్యాణ్ (ఫైల్)



అరవింద్ (ఫైల్)

ఫొటోగ్రఫీ వారి వృత్తి. అనుకున్నరంగంలోరాణించి పేరు సంపాదించాలనుకున్న వారి కలలు నెరవేరకుండానే అనంతలోకాలకు చేరుకున్నారు. ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. నలుగురి మృతదేహాలు శనివారం వారి స్వగ్రామాలకు చేరుకున్నాయి. 'తిరిగి వస్తానని చెప్పి వెళ్లి... కానరాని లోకాలకు వెళ్లారా' అంటూ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

- 8లో▸

– నర్సంపేట రూరల్/కమలాపూర్/ఇల్లెందు రూరల్

నటరాజ వందనం.. శివుడికే అంకితం

- అమ్మ రాసిన పుస్తకంలోంచి నృత్య రూపకం రూపొందించా..
- రామప్పలో ప్రదర్శించాలనేది నా కోరిక..
- కాకతీయులు ఏలిన వరంగల్‌లో ప్రదర్శిస్తున్నందుకు సంతోషంగా ఉంది
- 'సాక్షి'తో అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్



మల్లికా సారాభాయ్ గురించి క్లుప్తంగా..

అంతరిక్ష శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్, శాస్త్రీయ నృత్యకారిణి మృణాళిని సారాభాయ్ దంపతుల కుమార్తె మల్లికా సారాభాయ్. 1954 మే9న అహ్మదాబాద్‌లో జన్మించారు. చిన్నతనంలోనే నృత్యం నేర్చుకున్నారు. 15 ఏళ్ల వయస్సులో సినీ నటిగా పేరు తెచ్చుకున్నారు. 18 ఏళ్ల వయస్సులో భరతనాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యంలో అసాధారణమైన యువనర్తకిగా గుర్తింపు పొందారు. నాటక, నృత్యరంగంలో చేసిన కృషికిగానూ గుజరాత్ ప్రభుత్వం ఆమెకు గౌరవ్ పురస్కార్ అందించింది. 2010లో భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు.

హన్మకొండ కల్చరల్ : 'నటరాజ వందనం.. శివుడికి అంకితం చేసిన నృత్య ప్రదర్శన. నా తల్లి మృణాళిని సారాభాయ్ వెలువరించిన 'లవ్ సాంగ్స్ టు శివ' పుస్తకం నుంచి రూపొందించింది. సాధారణంగా పురుష దేవతల్లో ఐక్యత కోసం నాయిక అన్వేషణగా ఇది ప్రదర్శితమవుతుంది.' అని అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్ అన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్ప ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రం 'కుడా' మైదానంలో 'నటరాజ వందనం' నృత్యాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తన నృత్య అనుభవం.. నటరాజ వందనం ప్రదర్శన తీరు, వివిధ ఆలయాల్లోని శిల్పాల్లో నృత్య భంగిమల ప్రత్యేకతల్ని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

నాకు నృత్యమంటే ప్రాణం. ఈ ఇష్టం మా అమ్మ నుంచి వచ్చినట్లుంది. అమ్మ శాస్త్రీయ నృత్యకారిణి. పుస్తకాలు రచించేది. ఆ అభిరుచి నాకు కూడా అలవడింది. కాకతీయుల కాలం నుంచి ప్రసిద్ధి చెందిన పేరిణి నృత్యం గురించి నాకు తెలుసు. 40 ఏళ్ల క్రితం కూచిపూడి గ్రామానికి చెందిన సీఆర్ ఆచార్యుల వద్ద నేను నృత్యం నేర్చుకున్నా. ప్రపంచ వ్యాప్తంగా పేరిణి నృత్య ప్రదర్శనలిచ్చా. శాస్త్రీయ సమకాలీన రచనలు సృష్టించి ప్రదర్శనలిస్తూ వస్తున్నా. 30 ఏళ్లుగా ప్రతిష్టాత్మక ఆర్ట్స్ సంస్థ 'దర్పణ అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్'కు కో–డైరెక్టర్‌గా ఉన్నా. 1989లో మహిళా శక్తిని బలోపేతం చేసే సోలో థియేట్రికల్ వర్క్‌లను ప్రదర్శించాం. సామాజిక మార్పు కోసం, మహిళా సాధికారత, పర్యావరణ స్పృహ కలిగించేలా మా ప్రదర్శనలుంటాయి. అనేక రంగస్థల నిర్మాణాల్ని రూపొందించాం. సామాజిక మార్పు, పరివర్తన కోసం కళల్ని ఉపయోగించడమే నా ధ్యేయం.

నాట్యాల్లో ప్రత్యేకం..

నాట్యాల్లో నటరాజ వందనం ప్రదర్శన ఒక ప్రత్యేకం. మా అమ్మ మృణాళిని సారాభాయ్ రచించిన 'లవ్ సాంగ్స్ టు శివ' పుస్తకం నుంచి దీన్ని కూర్పు చేశాను. పరమాత్మ కోసం ఆత్మ చేసే అన్వేషణే భరతనాట్యం. శివపార్వతుల నృత్యాన్ని చూడడానికి విశ్వం నిశ్చలంగా మారుతుంది. ఈ ప్రదర్శనను వర్ణం అని కూడా పిలుస్తారు. ఈప్రదర్శనలో నృత్యకారుడు శివుడి తాండవ నృత్య శక్తిని, గంభీరమైన రూపాన్ని చూపిస్తాడు.

అభిరుచి ఉండాలి..

ఈపోటీ ప్రపంచంలో శాస్త్రీయ నృత్యం నేర్చుకోవాలంటే అభిరుచి ఉండి తీరాలి. లేదంటే మనల్ని మనం నిరూపించుకోలేం. ముందు తరాల వారు శాస్త్రీయ నృత్యాన్ని పరిపూర్ణంగా నేర్చుకోవాలి. నేర్చుకోవాలనే బలమైన కోరిక ఉండి, ఆర్థిక బలహీనత వల్ల వెనకబడేవారికి నేర్చుకునేలా అవకాశం కల్పించాలి. మన ప్రభుత్వం శాస్త్రీయ కళలకు నిధులు ఇవ్వడం లేదు, ప్రోత్సహించడం లేదు.

రామప్పలో ప్రదర్శించాలని కోరిక..

రామప్పలో నటరాజ నృత్య ప్రదర్శన ఇవ్వాలనేది నా కోరిక. కొన్ని కారణాల వల్ల ప్రదర్శన ఇవ్వలేకపోయా. కానీ కాకతీయులు ఏలిన వరంగల్ నగరంలో ప్రదర్శించడం కూడా సంతోషంగానే ఉంది. ఇందుకు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వారు చాలా సహకారం అందించారు. రామప్ప ఆలయంలోని శిల్పాల నృత్యభంగిమలు ఎంతో ప్రత్యేకమైనవి. పూర్వం పురాతన దేవాలయాల్లోనే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగేవి. అప్పటి వాళ్ల కళాపిపాసులు. అందుకేనేమో నృత్య ప్రదర్శనలను వివిధ నృత్య భంగిమల్లో శిల్పాలుగా రూపొందించారు. చరిత్రను, పురాతన దేవాలయాలను కాపాడుకోవాలి.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

టేకుమట్ల(రేగొండ): ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉద్యాన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు అనువైన పంట ఆయిల్ పామ్ అన్నారు. అన్ని రకాల పంటలతో పోల్చితే ఈ పంటతో ఎక్కువ లాభాలను పొందవచ్చన్నారు. మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, ఏడీఏ నరసింహం, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, రైతులు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పది శాతం నిధులు కేటాయించాలి

- వైద్యానికి 6 శాతం కేటాయింపులుండాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి బడ్జెట్‌లో నిధుల కోత పెడుతుందని, రాబోయే బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు, వైద్యానికి 6 శాతం నిధులు కేటాయించాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా, వైద్యానికి నిధులు తగ్గిస్తుందన్నారు. గత బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.64శాతం నిధులు, ఆయుష్మాన్ భారత్‌కు 2.1శాతం నిధులు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులపై ఫీజుల భారం మోపుతున్నారని ఆరోపించారు. ఆదివారం వరకు సంతకాలు సేకరించి 23న ప్రధానమంత్రికి కొరియర్ ద్వారా పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీధరకుమార్‌లోథ్, గడ్డం కృష్ణ, ఆర్‌డీ ప్రసాద్, అనిల్‌కుమార్, మధుర్ రావు, బ్రహ్మయ్య, రాజేశ్వరి, స్వప్న, వందన, వాణి, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సర్కార్ జాప్యం

రాష్ట్రంలోని ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ప్రతీ అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు ఎమ్మెల్సీని కలిశారు. 15–20 ఏళ్లుగా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్నామని వేతనం 30 శాతం పెంచాలని, కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఎత్తివేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును గవర్నర్ ఇప్పటి వరకు ఆమోదించలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, ఒప్పంద అధ్యాపకుల సంఘం బాధ్యులు డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ కరుణాకర్‌రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్, డాక్టర్ ఫిరోజ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కళలతో సమాజ చైతన్యం

- ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయ్

హన్మకొండ: నాట్యం కేవలం కళే కాదని సమాజాన్ని చైతన్యం చేసే సాధనమని ప్రముఖ భారత నృత్యకారిణి, పద్మభూషన్ మల్లికా సారాభాయ్ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళలకు రాజకీయం ఆపాదించడం ఎంత వరకు సమంజసమని, భక్తి ఆరాధనతో చేసే ఉత్సవాలను రామప్పలో నిర్వహించకుండా అభ్యంతరాలు చెప్పడం సరి కాదన్నారు. రామప్పలో ఉత్సవాలు నిర్వహించి శివుడికి ప్రీతిపాత్రమైన నృత్య ప్రదర్శన ఇవ్వాలని అనుకున్నానని, అక్కడ నిర్వహిస్తే ఎంతో సంతోషించే దానినని, రాజకీయాలు ముడిపెట్టి అనుమతివ్వకపోవడం బాధాకరమన్నారు. దీంతె వరంగల్‌లో ఉత్సవాల నిర్వహణకు కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఏర్పాట్లు చేసిందన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ట్రస్టీ బి.వి.పాపారావు మాట్లాడుతూ రాజకీయంగా విభిన్న అభిప్రాయాలు ఉండొచ్చు.. రామప్పకు భక్తి భావంతో వెళ్తాం.. అయితే దానిని రాజకీయంగా చూడడం సరి కాదన్నారు. తాము 14 ఏళ్లు కష్టపడి రామప్పకు యునెస్కో గుర్తింపు సాధించామన్నారు. రామప్ప కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నందునే రాజకీయ కోణంలో మల్లికా సారాభాయ్ ఫెస్టివల్‌కు అనుమతి ఇవ్వలేదన్నారు. ఇక్కడ కేసీఆర్ సీఎంగా ఉన్నారని.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిని ఇతరులకు ఇవ్వబోమని ఆయన అనడం లేదుగా అన్నారు. రాజకీయ ఇబ్బందులు వస్తాయనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రామప్పలో ఉత్సవాల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని వారసత్వ కట్టడాలను రాష్ట్ర పరిధిలోని తీసుకొచ్చేందుకు పోరాడుతామన్నారు.

కూలిన కలల సౌధం

బతుకుపోరులో ప్రాణాలు కోల్పోయిన యువకులు
- కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- స్వస్థలాలకు మృతదేహాలు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



రాము మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



కల్యాణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వారంతా 20 – 35 ఏళ్ల మధ్య వయసున్న యువకులు.. పనిచేస్తేనే బతుకు బండిని లాగే నిరుపేద కుటుంబాలు.. పొట్టకూటి కోసం ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని వృత్తిలో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు. ఇంతలోనే విధి వక్రీకరించి వారి కలల సౌధాన్ని కూల్చివేసింది. రోడ్డు ప్రమాద రూపంలో కుటుంబాలను వీధి పాలు చేసింది. చిన్న వయసులోనే కొడుకులు దూరమైన తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన యువతుల ఆర్తనాదాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు శనివారం తెల్లవారుజామునే ఇల్లెందు ఆస్పత్రికి చేరుకున్న వారి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం నలుగురి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తరలివచ్చి కడసారి చూశారు.

– ఇల్లెందు రూరల్/నర్సంపేట రూరల్/కమలాపూర్

ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలకే..

హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన భాషబత్తిని శ్రీనివాస్– రాజమణి దంపతుల కుమారుడు అరవింద్ (21) ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రేమించిన యువతిని పెద్దల అంగీకారంతో గత డిసెంబర్ 17న అరవింద్ పెళ్లి చేసుకున్నాడు. జీవితంలో స్థిరపడాలనే ఆకాంక్షతో ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించి హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. మిత్రులతో కలిసి ఫొటో షూట్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం మింగేసింది. ఒక్కగానొక్క కుమారుడిని గారాబంగా పెంచామని, కోరుకున్న యువతితో పెళ్లి చేయగా.. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని తల్లిదండ్రులు విలపించిన తీరు కలచివేసింది. ఇక వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కొంపెల్లి రాంబాబు– జయల ఏకైక కుమారుడు శివకోటి (31). ఆరేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం గ్రామానికి చెందిన కళ్యాణిని ప్రేమ వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫొటోగ్రఫీలో మెరుగైన జీవనం కోసం వరంగల్‌కు మకాం మార్చాడు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన గతేడాది జాతీయ స్థాయి అవార్డు అందుకున్నాడు. గతేడాదే శివకోటి తల్లి కేన్సర్‌తో మృతి చెందింది. తండ్రి రాంబాబు కరెంట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెడ్డింగ్ షూట్ కోసం బయలుదేరి రోడ్డు ప్రమాదంలో శివకోటి ప్రాణాలు కోల్పోగా భార్య, పిల్లలు, తండ్రి దిక్కులేని వారయ్యారు. మృతుల్లో మరో వ్యక్తి హనుమకొండ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన బైరి రాము(32) కూడా ఫొటోగ్రఫీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పదిహేనేళ్లుగా ఇదే రంగంలో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య రజిని, పాప, బాబు ఉండగా కుటుంబంతో సహా వరంగల్‌లో ఉంటున్నాడు. ఉన్నంతలో జీవనం సాఫీగా సాగుతున్న సమయాన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. రాముకు తల్లిదండ్రులు సదానందం, శ్రీలత ఉన్నారు.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్రాంతి రణధీర్..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన అబ్బునాపురం భాస్కర్–రజిత దంపతుల కుమారుడు క్రాంతి రణధీర్(22) తన స్నేహితుడైన కళ్యాణ్ వద్ద కలిసి ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించాడు. వృత్తిలో మెళకువలు నేర్చుకునేందుకు శుక్రవారం మిత్రుడితో కలిసి ఫొటో షూట్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను శనివారం ఉదయం ఖమ్మం ఆస్పత్రి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆవిరైన చిన్నమ్మ ఆశలు..



వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన ఓదెల కళ్యాణ్ (28) చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అదే సమయాన భర్తను కోల్పోయిన కళ్యాణ్ చిన్నమ్మ ఓదెల వనమాల ఆయనను దత్తత తీసుకుంది. ఇంటర్ వరకు చదువుకున్న కళ్యాణ్ ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకున్నాడు. 2017లో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన మౌనికతో వివాహం జరిగింది. పెళ్లయ్యాక వరంగల్ మకాం మార్చాడు. వీరికి రెండేళ్ల కూతురు అంజిత ఉంది. భార్య, కూతురు, చిన్నమ్మతో కలిసి సంతోషంగా ఉంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆయనను బలితీసుకుంది. దీంతో పెద్దదిక్కు కోల్పోయిన చిన్నమ్మ వనమాల, భర్త దూరమైన మౌనిక, తండ్రికి ఏమైందో తెలియక చిన్నారి అంజిత రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

అంత్యక్రియలు పూర్తి..

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఓదెల కల్యాణ్, భాషబత్తిని అరవింద్, కొంపెల్లి శివకోటి, బైరి రాము మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చారు. బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కడసారి చూసి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య మృతుల అంత్యక్రియలు పూర్తి చేశారు.





విలపిస్తున్న అరవింద్ కుటుంబ సభ్యులు, భార్యను ఓదారుస్తున్న మృతుడు అరవింద్ తండ్రి శ్రీనివాస్, ఇల్లందు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కళ్యాణ్ కుటుంబీకులు





శివకోటి కుమారులు అఖిల్, అక్షిత్.. కళ్యాణ్ కుమార్తె

అలరించిన నటరాజ వందనం




నృత్య ప్రదర్శన ఇస్తున్న మల్లికా సారాభాయ్ శిష్య బృందం

హన్మకొండ కల్చరల్ : రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో ప్రకటించిన సందర్భంగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ బాలసముద్రం కుడా మైదానంలో రామప్ప ఫెస్టివల్ వైభవంగా జరిగింది. ముందుగా ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ బీవీ పాపారావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడారు. అనంతరం ప్రముఖ కూచిపూడి, భారత నాట్య కళాకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మల్లికా సారాభాయ్ శిష్యబృందంతో ప్రదర్శించిన నటరాజ వందనం నృత్య ప్రదర్శన అలరించింది. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, గోపి, నగర పోలీస్ కమీషనర్ రంగనాథ్, వరంగల్ పూర్వ కలెక్టర్ బీపీ ఆచార్య, ములుగు ఎస్పీ విక్రమ్‌సంగ్రాం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీలు శ్రీధర్‌రావు, పాండురంగారావు, బూర విద్యాసాగర్‌గౌడ్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సన్మానించారు. కార్యక్రమానికి వాఖ్యాతగా మగ్దూం వ్యవహరించారు. ఉమ్మడి జిల్లాల నుండి అధికసంఖ్యలో నృత్యకళాకారులు, నృత్య గురువులు వారి శిష్యబృందంతో పాల్గొన్నారు. హన్మకొండ సీపీ షకూర్, ఏసీపీ కిరణ్‌కుమార్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.




నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, కలెక్టర్లు, పోలీస్ అధికారులు

చికిత్స పొందుతున్న యువరైతు మృతి



శ్రీను (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ యువ రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారు బోడతండాలో శనివారం జరిగింది. రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను(35)కు 1.20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఎకరం భూమిలో మిర్చి, 20 గుంటల్లో భూమిలో వరి సాగు చేశాడు. మిర్చికి అధిక పెట్టుబడి పెట్టినా సరైన దిగుబడి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను ఈ నెల 7న మిర్చి తోట వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. గమనించిన శ్రీను భార్య సరోజ చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండడంతో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి ఇస్లావత్ బోజ్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొడవలి.. కొట్లాట

- అత్తపై కోడలు.. భార్యపై భర్త దాడి
- ఎడపల్లి, వర్ధన్నపేటలో ఘటనలు



చికిత్స పొందుతున్న మొండమ్మ



చికిత్స పొందుతున్న ఎల్లమ్మ

మహదేవపూర్/వర్ధన్నపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తపై కోడలు, భార్యపై భర్త కొడవలితో దాడి చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం ఎడపల్లి, వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో శనివారం ఈ ఘటనలు జరిగాయి. ఎడపల్లికి చెందిన దుర్గం మొండెమ్మ కుమారుడు లక్ష్మయ్యకు 8 ఏళ్ల క్రితం సమతతో వివాహం జరిగింది. శనివారం అత్త, కోడలు మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి లోలైన సమత అత్త మొండమ్మపై నాటు కొడవలితో దాడి చేసింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజుకుమార్ తెలిపారు. మరో ఘటనలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం భార్యపై కొడవలితో దాడికి దారితీసింది. వర్ధన్నపేటకు చెందిన ఓర్సు రామచంద్రు – ఎల్లమ్మ దంపతులు కొంతకాలంగా తరుచూ గొడవ పడుతున్నారు. రామచంద్రుకు ఎల్లమ్మ మూడో భార్య కాగా, మొదటి భార్య, రెండో భార్య కూతుర్లు, కుమారులతో గొడవలు జరిగేవి. శుక్రవారం రాత్రి ఎల్లమ్మతో రామచంద్రు తీవ్రంగా గొడవ పడ్డాడు. శనివారం తెల్లవారుజామున కొడవలితో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఎల్లమ్మ అపస్మారక స్థితికి చేరుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎల్లమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై రామారావు తెలపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై రాజారం కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన ఎండి బాబర్(47) నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగిశాక ద్విచక్రవాహనంపై నర్సంపేట నుంచి స్వగ్రామం వస్తున్నాడు. నల్లబెల్లి క్రాస్ రోడ్డుకు రాగానే ములుగు జిల్లా మల్లంపల్లి నుంచి ఎర్రమట్టి లోడుతో వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాబర్ తలకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బాబర్‌ను నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య మాదర్‌తో పాటు కుమారుడు యాకుబ్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

మెడికల్ మాఫియా లబ్ధికే..

- రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయడం లేదు
- కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

ఐనవోలు: మెడికల్ మాఫియాకు లబ్ధి చేకూర్చడం కోసమే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సహకార శాఖ కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ ఆరోపించారు. లోక్‌సభ ప్రవాస్ యోజనలో భాగంగా హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలో శనివారం ఆయన పర్యటించారు. ముందుగా ఐనవోలులో మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం పున్నేలు క్రాస్ వద్ద గల సత్యం గార్డెన్‌లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన సదస్సులో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడారు. పేదరికంలో పుట్టి పెరిగిన ప్రధాని నరేంద్రమోదీకి పేదవారి కష్టాలు తెలుసునన్నారు. పేదలకు అనారోగ్యం చేస్తే ఆస్తులు అమ్ముకొని రోడ్డుపై పడుతున్న విషయాన్ని గమనించి ఆయుష్మాన్ భారత్ పథకానికి రూప కల్పన చేశారని తెలిపారు. ఈ పథకంలో చేరిన వారికి 1,300 రకాల జబ్బులకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కమలం వికసించి డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్‌లు అవినీతి, అక్రమాలు చేసి వేల ఎకరాల భూములు సంపాదించారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కార్పొరేటర్ జలగం అనిత, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పాసవుతానో.. లేదోనని..

- పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



హాసిని (ఫైల్)

ఎల్కతుర్తి: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇంటి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శలగాని రమేష్ ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. వీరికి హాసిని(15) తోపాటు కుమారుడు ఉన్నాడు. హాసిని హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట వద్ద గల ఐపీఎస్ స్కూల్లో పదో తరగతి చదువుతుంది. యూనిట్ టెస్టుల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని.. వార్షిక పరీక్షల్లో పాస్ అవుతానో లేదోనని మనస్తాపం చెందిన హాసిని ఇంటి వద్ద రేకుల షెడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.